సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 5 । నవంబర్ । 2024



గురుకులం విద్యార్థినులకు పాము కాటు

కొండాపురం మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం తెల్లవారుజామున ఇద్దరు విద్యార్థినులను పాము కాటు వేసింది. - 8లో



కరువు మండలాల ప్రకటనలో అన్యాయం

కరువు మండలాల ప్రకటనలో వైఎస్సార్ జిల్లాకు అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. - 8లో

గరిష్టం/కనిష్టం
33.2 /25.4

వాతావరణం

జిల్లాలో సోమవారం 25.4 - 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక



కడప సెవెన్‌రోడ్స్ : కలెక్టరేట్‌లో మంగళవారం జరగనున్న డీఆర్‌సీ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత రానున్నారని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 6.00 గంటలకు పెనుగొండలోని తన నివాసం నుంచి బయలుదేరి 10 గంటలకు కడప ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం నుంచి డీఆర్సీ సమావేశంలో పాల్గొంటారని ఇన్‌చార్జ్ కలెక్టర్ తెలిపారు.

జేఎన్‌టీయూ వైస్ ప్రిన్సిపల్‌గా శేష మహేశ్వరమ్మ



వైస్ ప్రిన్సిపల్ శేష మహేశ్వరమ్మకు అభినందనలు తెలుపుతున్న అధ్యాపకులు

పులివెందుల రూరల్ : జేఎన్‌టీయూ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా శేష మహేశ్వరమ్మ నియమితులయ్యారు. పట్టణంలోని స్థానిక జేఎన్టీయూలో సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సుబ్బారెడ్డి అనంతపురం జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన శేష మహేశ్వరమ్మను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్ రెడ్డి

కడప అగ్రికల్చర్ : ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం (ఏపీఎంఐపీ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం కడపలోని ఏపీఎంఐపీ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈయన గతంలో అన్నమయ్య జిల్లా ఏపీఎంఐపి పీడీగా పనిచేసే వారు. ఇటీవలే ఆయనను ఫారిన్ సరీ్వస్ కింద కడపకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బిందు, తుంపర సేద్యం అమలుకు కృషి చేస్తానన్నారు. సబ్సిడీతో అందించే పరికరాలను సకాలంలో అందించి రైతు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలను తనిఖీ చేస్తున్న వైవీయూ వీసీ, సీఈ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ కళాశాలల 2,4 సెమిస్టర్ల పరీక్షలు సోమవారం జిల్లాలోని 16 కేంద్రాలలో ప్రారంభమయ్యాయి. వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు కడపలోని ఎస్వీ బీఈడీ కళాశాల, శ్రీహరి బీఈడీ కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను ఏర్పాటు చేశామని, హై పవర్ కమిటీ ప్రతినిధులు తనిఖీలు నిర్వహిస్తున్నారని వివరించారు. హైపవర్ కమిటీ సభ్యులు ఆచార్య సునీత, డాక్టర్ రియాజున్నిసా కడపలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ముగిసిన గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాలలో కామర్స్, కాంపిట్యూషనల్ డేటా సైన్సెస్ సబ్జెక్టులలో గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలో వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఆచార్య ఏజీ దాము, సబ్జెక్ట్ నిపుణులు కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం ఆచార్యులు విశ్వనాథరెడ్డి, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.శ్రీదేవి, ఆచార్య జి. విజయభారతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయని ప్రతిభతో పాటు పీహెచ్‌డీ, నెట్ అర్హత ఉన్న వారికి ఎంపికల్లో ప్రాధాన్యత ఇస్తామని వివరించారు.

కడపపై ఎందుకీ కక్ష!

నేడు జిల్లా సమీక్షా కమిటీ సమావేశం

- ఒక్క మండలంలోనూ కరువు కనిపించలేదా?
- సాగునీటి ప్రాజెక్టులపై బాబుకు ఆదినుంచి చిన్నచూపే
- ఓట్లు, సీట్లు కట్టబెట్టినా కరుణించిన కూటమి సర్కార్
- జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై ఎమ్మెల్యేల మూగనోము



ఎర్రగుంట్ల ప్రాంతంలో ఎండిన వేరుశనగను దున్నేస్తున్న రైతు (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్: కూటమి అభ్యర్థులను గెలిపిస్తే జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టించే బాధ్యత తీసుకుంటామని సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చంద్రబాబు పదేపదే ప్రజలకు హామీ ఇచ్చారు. దీంతో ప్రజలు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదు కూటమికి కట్టబెట్టారు. అధికార పగ్గాలు చేపట్టాక ఎప్పట్లాగే కక్షగట్టారు. అభివృద్ధి మాట అటుంచి జిల్లాపై వివక్ష చూపుతున్నారు. కరువు జాబితాలో జిల్లాకు చోటు కల్పించకపోవడం, కొప్పర్తి ఎంఎస్ఎంఈ టెక్నికల్ సెంటర్‌ను అమరావతికి తరలించడం, పులివెందుల మెడికల్ కళాశాలకు మంజూరైన 50 ఎంబీబీఎస్ సీట్లు రద్దు చేయడం, ఉక్కు ఫ్యాక్టరీ ఊసెత్తకపోవడం వంటివి మచ్చుకు కొన్ని ఉదాహరణలు. బాబు మాటలు నీటి మూటలు కావడంతో మరోమారు మోసపోయామని జిల్లా వాసులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఇంత అన్యాయం చేస్తున్నా కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు ప్రశ్నించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారు. మంగళవారం జరగనున్న జిల్లా సమీక్ష కమిటీ సందర్భంగా వామపక్షాలు ఆందోళనలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

కరువు జాబితాలో దక్కని చోటు

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా అంతటా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. సాగు చేసిన మినుము, జొన్న, కంది, వేరుశనగ తదితర పంటలు నిలువునా ఎండిపోవడంతో రైతులు దున్నేశారు. దీంతో వారు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ముందే డబ్బు చెల్లించిన కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. కాగా, వ్యవసాయాధికారులు మాత్రం పంటల దిగుబడులు అద్భుతంగా వస్తాయంటూ అంచనాలు తయారు చేసి తప్పుడు నివేదికలు ఇచ్చారు. ఏమిటీ ఈ అన్యాయం అంటూ ఇటీవల జెడ్పీ సమావేశంలో సభ్యులు నిలదీయగా, వ్యవసాయశాఖ జేడీ నీళ్లు నమిలిన పరిస్థితి. అధికారుల తప్పుడు నివేదికల వల్ల రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, రుణాల రీషెడ్యూల్ వంటి ప్రయోజనాలు దూరమయ్యాయి. మాజీ ముఖ్యమంత్రి జిల్లా కావడం వల్ల రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కూటమి ప్రభుత్వం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించలేదన్న అభిప్రాయం రైతుల్లో సర్వత్రా వినబడుతోంది.

సాగునీటి ప్రాజెక్టులంతేనా?

జిల్లాలోని తెలుగుగంగ, గాలేరు-నగరిలో అంతర్భాగమైన వామికొండ, సర్వరాయసాగర్ రిజర్వాయర్ల కింద డిస్ట్రిబ్యూటరీలు, ఫీల్డ్ ఛానల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. గాలేరు-నగరి రెండవ దశ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ కోసం రాజోలి, జొలదరాశి రిజర్వాయర్ల నిర్మాణాన్ని చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రాజోలి జలాశయ నిర్మాణం కోసం భూ సేకరణ నిర్వహించారు. ఎకరాకు రూ.12 లక్షలు చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. తక్షణమే పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

దాల్మియా ముంపు భూముల సమస్య

మైలవరం మండలం చిన్నకొమెర్ల గ్రామం వద్ద దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసింది. ఫ్లడ్ ఫ్లోలో నిర్మాణం చేపట్టడం వల్ల రైతులకు చెందిన సుమారు 600 ఎకరాల భూములు ముంపునకు గురవుతున్నాయి. ముంపునకు గురవుతున్న తమ భూములను కొనుగోలు చేయాలంటూ చాలా రోజులుగా రైతులు కోరుతున్నా ఫ్యాక్టరీ యాజమాన్యం పెడచెవిన పెడుతోంది. ముంపునకు గురవుతున్న భూములను వెంటనే దాల్మియా యాజమాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

➡ ఆగిన ట్రిపుల్-ఆర్ నిధులు

ట్రిపుల్-ఆర్ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని 110 చేనేత సహకార సంఘాలకు 2020-21లో రూ. 1368.46 లక్షలు విడుదలయ్యాయి. వీటిని నాబార్డు ద్వారా డీసీసీ బ్యాంకులో జమ చేశారు. జిల్లాలోని 18 సంఘాలు రుణ బకాయిలు ఉన్నాయని రూ. 222.44 లక్షలు ఈ నిధుల్లో నుంచి బ్యాంకు జమ చేసుకుంది. అయితే రూ. 1146.01 లక్షలు మిగిలిన సంఘాల అకౌంట్లలో జమ చేయకుండా సస్పెన్స్ అకౌంటులో ఉంచింది. ఈ నిధులకు వడ్డీ చెల్లింపులు ఉండవు. ఇది ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధం. ఇలా నాలుగేళ్లుగా చేనేత సహకార సంఘాలకు ట్రిపుల్-ఆర్ పథకం నిధులు విడుదల కాకుండా నిలిచిపోయాయి.

● ఇంకా...

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న 1813 మంది గ్రీన్ అంబాసిడర్లకు కొన్ని నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులుగా సేవలు అందిస్తున్న వారికి పూర్తి స్థాయిలో వేతనాలు ఇవ్వడం లేదు. ఒక్కో పారిశుధ్య కార్మికునికి రూ. 14 వేలు వేతనం చెల్లించాల్సి ఉండగా, ఏజెన్సీ నిర్వాహకులు రూ. 9 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. జిల్లాలో నెలకొన్న ఈ సమస్యలపై డీఆర్‌సీలో చర్చించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

● జాడలేని కడప 'ఉక్కు'



విభజన హామీల్లో భాగంగా జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. జగన్ సీఎంగా ఉన్నప్పుడు జమ్మలమడుగు నియోజకవర్గంలో జిందాల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. బాబు ప్రభుత్వం ఈ ప్లాంటు నిర్మాణంపై శ్రద్ధ చూపడం లేదు. మరోవైపు అనకాపల్లిలో భారీ ఉక్కు పరిశ్రమను నిర్మిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. కరువుతో అల్లాడుతూ ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్న వైఎస్సార్ జిల్లాలోని ఉక్కు ఫ్యాక్టరీ గురించి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.

● మంజూరైన సీట్లు రద్దు



వైఎస్ జగన్ సర్కార్ రూ.530 కోట్లతో పులివెందులలో మెడికల్ కళాశాల నిర్మించింది. మౌళిక వసతులు, ఫ్యాకల్టీ తీరు తెన్నులను పరిశీలించిన నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఈఏడాది 50ఎంబీబీఎస్ సీట్లు కేటాయిస్తూ ఆగస్టు 5న ఉత్తర్వులు జారీ చేసింది. కాకపోతే పెండింగ్ పనులు ఆటంకం లేకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అండర్ టేకింగ్ లెటర్ కోరింది.కడపపై కక్ష కట్టిన చంద్రబాబు సర్కార్ లెటర్ ఇవ్వకపోవడంతో భర్తీ కావాల్సిన మెడికల్ సీట్లు కోల్పోవాల్సి వచ్చింది. ఈ ప్రాంత విద్యార్థిలోకానికి ఇదో తీవ్ర ద్రోహంగా పలువురు వాపోతున్నారు.

● టెక్నికల్ సెంటర్ తరలింపు



కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు జగన్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని సీఎం చంద్రబాబు అమరావతికి తరలించారు.కొప్పర్తి నార్త్ బ్లాక్‌లో 19.5 ఎకరాల విస్తీర్ణంలో 250 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన ఈ టెక్నాలజీ సెంటర్ కార్యరూపం దాల్చి ఉంటే జిల్లా పారిశ్రామికాభివృద్ధికి ఎంతగానో దోహదపడేది. వివిధ ఇంజనీరింగ్ రంగాలకు సంబంధించిన కోర్సులను ఇది అందిస్తుంది. దీనిపై కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు నోరు మెదపకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్




కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో అర్జీదారులు వస్తారని.. వారు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్‌తోపాటు డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ శ్రీనివాసులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'క' చిత్రబృందం రాక

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక సుధ హాల్‌కు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'క' చిత్ర బృందం వస్తున్నట్లు 'ఏపీ 04 రామాపురం' సినిమా డైరెక్టర్ హేమారెడ్డి, కిరణ్ అభిమాని సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 'క' సినిమా విజయోత్సవ వేడుకల్లో భాగంలో సినిమా హీరో కిరణ్ అబ్బవరంతో పాటు చిత్ర బృందం పట్టణానికి వస్తున్నారని వారు పేర్కొన్నారు. అభిమానులు పాల్గొనాలని కోరారు.





కడప ఎంజేకుంట శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఆరనీకుమా ఈ దీపం..

కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా శివాలయాలు కార్తీక దీప కాంతుల్లో మెరిసిపోయాయి. తొలి దర్శనం చేసుకున్నా...తొలిదీపం పెట్టినా అధిక పుణ్య లభిస్తుందన్న విశ్వాసంతో భక్తులు తెల్లవారుజాము 3.30 గంటల నుంచే ఆలయాలకు క్యూ కట్టారు. జిల్లా అంతటా భక్తులు శివయ్యకు ఘనంగా పూజలు నిర్వహించారు. శివజ్యోతులను వెలిగించి మనసారా మొక్కుకున్నారు. జిల్లాలోని చిన్నాపెద్దా శివాలయాలన్నీ కార్తీక దీప కాంతులతో నిండిపోయాయి. - మహమ్మద్ రఫి, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప



108 కష్టాలు!

మొన్న దసరా పోయింది..నిన్న దీపావళీ అయిపోయింది. నెలలు గడుస్తున్నా వేతనాలూ అందడం లేదు... ఒక పండుగ..పబ్బం అంటూ లేకుండా పోయింది.. ఇదీ 108 అంబులెన్సు సిబ్బంది ఆవేదన. మరోవైపు ఈ వాహనాలకూ '108 కష్టాలు' చుట్టుముట్టాయి. అవును.. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారిని ఆదుకొనే 'అంబులెన్స్‌కే ఆపద' వచ్చింది. ఈ వ్యవస్థకు పట్టిన 'చంద్ర'గ్రహణం ఎప్పుడు వీడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

- సిబ్బందికి అందని వేతనాలు
- ఎఫ్‌సీ,ఇన్సూ్యరెన్స్‌కు నోచని వాహనాలు
- అరకొర మందుల సరఫరా
- ఆఖరికి మాస్క్‌లు,గ్లౌజ్‌లకు కొరతే
- అదుపు తప్పిన '108 అంబులెన్స్'వ్యవస్థ

కడప రూరల్ : కుయ్..కుయ్ మని శబ్దం వినిపిస్తే చాలు..ఎవరో ఆపదలో ఉన్నారు. వారిని కాపాడడానికి 108 అంబులెన్స్ వెళ్తోందని అందరికీ ఇట్టే అర్థం అవుతుంది. ఆ వాహనానికి ఉండే ప్రత్యేకత అది. ఇప్పుడీ అంబులెన్సే పలు రకాల సమస్యలతో అదుపుతప్పింది. దీంతో ఈ వ్యవస్థ ప్రమాదం అంచున నిలిచింది.

నాలుగు నెలలుగా అందని వేతనాలు...

ఒక అంబులెన్స్ వాహనానికి ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్), పైలెట్ (డ్రైవర్)లు విధులను చేపడుతారు. ఇక ఈఎంటీకి ఒక నెలకు రూ. 18 వేల నుంచి రూ. 28 వేలు, ఒక పైలట్‌కు రూ. 16 వేల నుంచి 26 వేల వరకు జీతం వస్తుంది. నాలుగు నెలల నుంచి సిబ్బందికి వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఏళ్లుగా 108 అంబులెన్స్ సర్వీసెస్‌నే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. వీరి వేతనాలపైనే కుటుంబమంతా ఆధారపడి ఉంది. ప్రతి నెలా వచ్చే జీతంతోనే ఇంటి బాడుగలు, పిల్లల చదువులు ఇతర అవసరాలకన్నింటికీ ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొన్నొచ్చిన దసరా...నిన్నెళ్లిన దీపావళి పండుగలను కూడా చేతిలో ఏమీలేక జరుపుకోలేదు. ఆపదలో ఉండే వారిని ఆదుకొనే సిబ్బందే తమకు జీతాలు మంజూరు చేయాలని ఎదురుచూస్తున్నారు.

108 అంబులెన్స్ వాహనాల వివరాలు

వాహనాలు : 38 పైలెట్లు : 94
ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌లు : 92

వాహనాల పర్యవేక్షణపై నిర్లక్ష్యం....

ఏ వాహనానికైనా ఎఫ్‌సీ (ఫిట్‌నెస్ సర్టిఫికెట్), ఇన్సూరెన్స్ ప్రధానం. ఈ రెండూ లేకపోతే ఆ వాహనం రోడ్డుపైకే రాకూడదు. అయితే 108 అంబులెన్స్ వాహనాలకు చాలా వాటికి ఈ రెండు లేవు. వాహనం కండీషన్ ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుంది. అలాగే ఏదైనా ప్రమాదం జరిగితే..ఆ ప్రమాదంలో పొరపాటున ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబానికి ఇన్సూరెన్స్ ఆర్థిక భరోసానిస్తుంది. అదే సందర్భంగా నిబంధనల ప్రకారం డ్రైవింగ్‌లో ఉన్న డ్రైవర్‌కు భద్రత ఉంటుంది. ఇటీవల మైదుకూరు నియోజకవర్గ పరిధిలో 108 అంబులెన్స్ వాహనం ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. ఆ వాహనానికి ఎఫ్‌సీ, ఇన్సూరెన్స్ లేదు. ఈ సంఘటనకు సంబంధించి అంబులెన్స్ డ్రైవర్‌ను విధుల నుంచి తప్పించారు. ఇందుకు సంబంధించి కేసు కూడా నమోదైంది. అదే ఎఫ్‌సీ ,ఇన్సూరెన్స్ ఉండి ఉంటే ఏ ఇబ్బందులు ఉండేవి కావు. ఇలా ఆపదలో ఉండే పలువురి వాహనాలు కాపాడే '108'వాహనాలపై పర్యవేక్షణ కొరవడింది.

మందులకు ఇబ్బందులు...

108 వాహనంలో రోగిని ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో మార్గ మధ్యంలో ఆ వ్యక్తికి ఎలాంటి ప్రాణ నష్టం కలుగకుండా ఎమర్జెన్సీ మందులను ఇస్తారు. కీలకమైన సమయంలో ఈ మందులు మనిషి ప్రాణాలను రక్షిస్తాయి. అలా వాహనంలో ఆక్సిజన్‌తో పాటు పలు రకాల మందులు అందుబాటులో ఉండాలి. అయితే కొన్ని వాహనాల్లో మందుల కొరత ఏర్పడింది. ఆఖరికి సిబ్బంది వేసుకొనే గ్లౌజ్‌లు..మాస్క్‌లకు కొరత ఏర్పడినట్లుగా తెలిసింది. మందులు అరకొరా సరఫరా అవుతున్నట్లుగా సమాచారం.

'108'పై నిర్లక్ష్య వైఖరి...

టీడీపీ ప్రభుత్వం వచ్చిన ప్రతి సారీ '108' ఆటుపోట్లకు గురవుతూ వచ్చింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 108 వ్యవస్థకు మహర్దశ పట్టింది. మండలానికి ఒకటి చొప్పున అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. ఈ వాహనాలను ఆధునిక వైద్య పరికరాలతో తీర్చిదిద్దారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ '108'కు 'చంద్ర'గ్రహణం పట్టింది. ప్రజల ప్రాణాలు కాపాడే వ్యవస్థను మరింతగా పటిష్టవంతం చేయాల్సిందిపోయి..వ్యవస్థనే విచ్ఛిన్నం చేయడం ఎంతమాత్రం తగదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

చాలా ఇబ్బందులు పడుతున్నాం



మాకు నాలుగు నెలలుగా జీతాలు రాలేదు. మా సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి మాకు వేతనాలు వచ్చేలా చూడాలి.
- రెడ్డెప్పరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, 108 అంబులెన్స్ సర్వీసెస్.

ప్రతి నెలా జీతాలు వచ్చేలా చూడాలి



మాకు ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు రావడం లేదు. దీంతో కష్టాలు పడుతున్నాం. మా సమస్యలను పరిష్కరించాలి. ప్రతి నెలా వేతనాలు వచ్చేలా చూడాలి.
- శివారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, 108 అంబులెన్స్ సర్వీసెస్

ఘనంగా నషాన్ ఉత్సవం



దర్గా గుంబద్‌పై దర్శనమిస్తున్న నషాన్

కడప కల్చరల్ : కడప పెద్దదర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని తెలుపుతూ దర్గాలో భక్తులు నషాన్ (ఝెలా) ఉత్సవాన్ని నిర్వహించారు. అందులో భాగంగా మాసాపేట మై అల్లా దర్గా నుంచి నషాన్‌ను ఊరేగింపుగా నగరంలోని భక్తులకు దర్శింపజేశారు. విద్యుద్దీప కాంతుల, బ్యాండు మేళాల మధ్య అట్టహాసంగా ఊరేగింపు నిర్వహించారు. కృష్ణాసర్కిల్, ఏడురోడ్ల కూడలి, వన్‌టౌన్, గోకుల్ సర్కిల్ మీదుగా వైవీ స్ట్రీట్ నుంచి ఊరేగింపు పెద్దదర్గాకు చేరుకుంది. దర్గాకు చేరిన అనంతరం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి నషాన్‌ను గుంబద్‌పై ఎగుర వేశారు. ఉరుసు ఉత్సవాలు పూర్తయ్యేంతవరకు నషాన్ భక్తులకు దర్శనమిస్తూ ఉంటుంది.

క్లుప్తంగా

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ వీఆర్‌ఏలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ యూనియన్ జిల్లాగౌరవాధ్యక్షులు బి.మనోహర్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా వీఆర్‌ఏలకు వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి 26,000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పని చేస్తున్న వీఆర్‌ఏలకు నామినీ సదుపాయం కల్పించాలని, అర్హులైన వారందరికీ వాచ్‌మెన్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18వ తేదీ నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి, వెంకటసుబ్బయ్య, చక్రవర్తి, సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటసుబ్బయ్య చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ధర్నా

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని అకడమిక్ బ్లాక్ వద్ద సోమవారం విద్యార్థులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లో విద్యార్థులు బయటకు వెళ్లకుండా మూడు క్యాంటీన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉన్న క్యాంటీన్లను మూసి వేయించి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గతంలో ఉన్న క్యాంటీన్లను ఖాళీ చేయాలని ట్రిపుల్ ఐటీ యాజమాన్యంపై టీడీపీ నాయకులు ఒత్తిడి తీసుకురావడంతో వారు క్యాంటీన్లను మూసివేశారన్నారు. ఇప్పటి వరకు కొత్త క్యాంటీన్లకు టెండర్లను పిలవక పోగా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు అప్పగించారని, వారు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపే ఇంటికి వెళ్లిపోతున్నారని తెలిపారు. దీంతో తాము వివిధ రకాల తినుబండారాలకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అంతేకాకుండా అక్కడ పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది రూ.100, రూ.50లు చెల్లించిన వారికి మాత్రమే బయటి ఫుడ్‌ను అనుమతిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

విద్యార్థి అదృశ్యం

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మృత్యుంజయకుంటకు చెందిన మణికంఠ (13) అనే 8వ తరగతి విద్యార్థి ఈ నెల 3న తన స్నేహితులతో వెళ్లి తిరిగి రాలేదని అతని తండ్రి రాయుడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తన స్నేహితులతో కలిసి పెన్నానది ప్రాంతానికి వెళ్లినట్లుగా విద్యార్థి తండ్రి రాయుడు అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ చేస్తున్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో కాగితాలపెంటకు చెందిన షేక్ ఫిరదౌసి (30) తన భర్త కరీముల్లా వేధిస్తున్నాడని రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనలో నిందితుడు కరీముల్లాను సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

‘పెన్నమ్మ’కు గర్భశోకం


బిస్మిల్లాబాద్ వద్ద పెన్నా నదిలో ఇసుకను తోడేస్తున్న అక్రమార్కులు


ట్రాక్టర్లలో బయట ప్రాంతాలకు తరలిపోతున్న ఇసుక

- ఇసుకను తోడేస్తున్న టీడీపీ నాయకులు
- ట్రాక్టర్‌కు గేటు వసూలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- నిద్రావస్థలో ప్రభుత్వ యంత్రాంగం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఎర్రగుంట్ల మండల పరిధిలోని హనుమనుగుత్తి గ్రామ పంచాయతీ బిస్మిల్లాబాద్ గ్రామ సమీపాన ఉన్న పెన్నా నదిలోని ఇసుకను అక్రమదారులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. పైగా గేటు వసూలు చేస్తున్నారు. క్వారీలో నుంచి అవసరమైనప్పుడు ఇసుకను ఉచితంగా తెచ్చుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఎర్రగుంట్ల మండల పరిధిలో ఎక్కడా ఇసుక క్వారీ లేదు. దీంతో అక్రమార్కులు ఇసుకను తోడేస్తూ పెన్నమ్మకు గర్భశోకం మిగిలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిస్మిల్లాబాద్ గ్రామంలోని కొందరు టీడీపీ నాయకులు పెన్నానదిలోని ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు ఒక రేటు పెట్టి గేటును వసూలు చేస్తున్నారు. రోజుకు ఒక్కరు చొప్పున వంతులు వేసుకొని బయట నుంచి ట్రాక్టర్లను రప్పించుకొని.. అనధికారంగా గేటును పెట్టుకుని వసూళ్లకు తెరలేపారు. రోజుకొకరు చొప్పున ఇసుకను అమ్ముకుంటున్నారు. ప్రొద్దుటూరు, రామేశ్వరం పోట్లదుర్తి గ్రామాల నుంచి ఇసుక కోసం రోజూ ట్రాక్టర్లు వరుసలో నిలబడుతున్నాయి. ఇసుక తరలిపోతుండటం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. వీరి అక్రమాలను మొదట్లో గ్రామస్తులు అడ్డుకున్నారు. తర్వాత గ్రామ కోసం డబ్బు వసూలు చేస్తున్నామంటూ వారికి నచ్చజెప్పారు.

అధికారులకు ఫిర్యాదు చేసినా..

పెన్నానదిలో అక్రమంగా ఇసుకను గేటు పెట్టి వసూళ్లు చేసుకుంటున్నారని గ్రామంలోని కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పక్క మండలాల్లో ట్రాక్టర్లను సీజ్ చేసిన సంఘటనన్నాయి. కానీ ఎర్రగుంట్ల మండల పరిధిలోని అధికార యంత్రాంగం మాత్రం తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఉత్సాహంగా అండర్–14 క్రికెట్ టోర్నీ


గుంటూరు కౌషిక్ (151 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. సోమవారం కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, శ్రీకాకుళం జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన అనంత జట్టు 45.1 ఓవర్లలో 130 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని హేమచంద్రనాయక్ 29 పరుగులు చేశాడు. శ్రీకాకుళం బౌలర్ సిమ్మా సాత్విక్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 44 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జట్టులోని నేత్రా కిరణ్ 77, వివేకానంద 62 పరుగులు చేశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి శ్రీకాకుళం జట్టు 26 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

రాజారెడ్డి స్టేడియంలో..

వైఎస్‌ఆర్‌ఆర్–ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. జట్టులోని సుశాంత్ 67, సాయియశ్వంత్ 51 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్ రితిక్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విజయనగరం, గుంటూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు 89.3 ఓవర్లలో 313 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కౌషిక్ 183 బంతుల్లో 151 పరుగులు చేశాడు. విజయనగరం బౌలర్ సాయిప్రణీత్ 3 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

దివ్యాంగుడిపై ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల దాడి

లాఠీతో విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్ర గాయాలు


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జయశంకర్

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి జయశంకర్ అనే దివ్యాంగుడిని పెండ్లిమర్రి ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, కానిస్టేబుళ్లు లాఠీతో విచక్షణారహితంగా దాడి చేసి కొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడు కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నందిమండలం గ్రామంలో దాదాపు 13 ఏళ్ల క్రితం స్థలం కొన్నాడు. ప్రస్తుతం ఆ స్థలంలో ఇల్లు నిర్మిస్తుండగా.. పక్కన ఉన్న రాయవరం నాగేంద్ర ఆ స్థలంలో తనకు కొంత భాగం ఉందని పెండ్లిమర్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం కానిస్టేబుల్‌లు జయచంద్ర, సూర్యప్రకాష్‌రెడ్డి వచ్చి ఎస్‌ఐ రమ్మంటున్నాడని జయశంకర్‌ను స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. ఎందుకు ఆక్రమించావని ఎస్‌ఐ అడగగా.. స్థలానికి సంబంధించిన పత్రాలు తన దగ్గర ఉన్నాయని తెలిపాడు. అయినా ఎస్‌ఐ లాఠీతో తీవ్రంగా కొట్టి, బూటు కాలితో తన్ని విచక్షణా రహితంగా కొట్టాడని జయశంకర్ వాపోయాడు. ఆదివారం మధ్యాహ్నం ఒక సారి, సాయంత్రం ఒకసారి రెండు సార్లు తీవ్రంగా కొట్టి రాత్రి వరకు స్టేషన్‌లోనే ఉంచారని పేర్కొన్నారు. రాత్రి అతని కుమారుడి చేత జామీను సంతకాలు చేయించుకొని తిరిగి సోమవారం రావాలి చెప్పారు. అప్పటికే అతనికి బీపీ లెవల్స్ పడిపోయాయి. రాత్రి వెంటనే కడప రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ‘పెండ్లిమర్రి ఎస్‌ఐ తనకు న్యాయం చేయరని, స్టేషన్‌కు వెళితే చిత్రహింసలకు గురి చేస్తారని, ఉన్నతాధికారులు స్పందించి తన స్థలం ఇప్పించి.. ఎస్‌ఐ, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలి’ అని బాధితుడు వేడుకొంటున్నాడు.

నేటి నుంచి అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలోని తిమ్మాయపల్లెలో ఉన్న అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు మంగళవారం నుంచి శుక్రవారం వరకు జరగనున్నాయి. తిమ్మాయపల్లెలోని ఊసయ్య గారి ఆశ్రమ ఆవరణలో మంగళవారం ఉదయం కొండయ్యస్వామి తన 43వ జన్మదిన వేడుకల్లో భక్తుల మధ్య కేక్ కట్ చేయనున్నారు. ఈ సందర్భంగా చెక్క భజనలు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి ప్రభ కార్యక్రమం, ఆర్కెస్ట్రా ఏర్పాటు చేస్తారు. రాత్రి 9 గంటలకు జబర్దస్త్ కళాకారులతో జబర్దస్త్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. బుధవారం రాత్రి కూడా ప్రభ, ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. బుధవారం చెక్క భజన, కోలాటాలు, రాత్రి 9 గంటలకు గయోపాఖ్యానం, సత్యహరిచంద్ర పౌరాణిక నాటకాల ప్రదర్శన ఉంటుందని వివరించారు. కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు జరిగే నాలుగు రోజులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

15 నుంచి పెయింటింగ్ పోటీలు

కడప కార్పొరేషన్ : జిల్లాలోని ప్రాచీన చరిత్ర, పర్యాటక ప్రాంతాలు, వాటి సంస్కృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దక్షిణ భారత పర్యాటక సంస్థ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కళాకృతి ఆర్ట్స్ గ్యాలరీ నిర్వాహకులు డాక్టర్ మాధవి సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆలయాలు, కోటలను పరిరక్షించుకునేందుకు తమ సంస్థల ఆధ్వర్యంలో నెలకొక పర్యాటక ప్రాంతం చొప్పున ఓపెన్ స్పాట్ పెయింటింగ్ కాంపిటేషన్‌ను నవంబర్ 15వ తేదీ పుష్పగిరి నుంచి మొదలు పెడుతున్నామని వారు పేర్కొన్నారు. పెయింటింగ్స్ వేయదలుచుకున్న వారు (ఆర్టిస్టులు) సామగ్రిని తామే తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్లు: 9290131343, 8309710250ను సంప్రదించాలని కోరారు.

అక్రమ ఇసుక తరలింపుపై రైతుల ఆందోళన


అక్రమ ఇసుక తరలింపై ధర్నా చేస్తున్న రైతులు, సీపీఐ నాయకులు

వేంపల్లె : వేంపల్లి పాపాఘ్ని నదిలో ఇసుక అక్రమ తరలింపుపై రైతులు ధర్నాకు దిగారు. సోమవారం వేంపల్లె పట్టణంలోని పాపాఘ్ని నది మాలవంక సమీపంలో కొందరు ట్రాక్టర్లతో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపాఘ్ని నదిలో ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రింబవళ్లు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని, దీంతో నదిలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. నదిలో భూగర్భ జలాలు అడుగుంటిపోతాయన్న ఆందోళన కలుగుతోందన్నారు. అలాగే విచ్చలవిడిగా ఇసుకను తరలించడం వల్ల రైతులకు సంబంధించి భూములు కోతకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నది చుట్టూ ఉన్న పరీవాహక ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గిపోయి బోర్లలో నీళ్లు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో పాపాఘ్ని నదిలోకి ఇసుక ట్రాక్టర్లను వెళ్లనీయమంటూ ఆందోళన చేపట్టినట్లు చెప్పారు. ఉచిత ఇసుక మాటున కొందరు ఈ ఇసుకాసురులు పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ధర్నాకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ధర్నాపై తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి స్పందించారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరం ఉన్న వ్యక్తులు మాత్రమే కొత్తూరు, నంది మండలం వద్ద ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను తెచ్చుకోవాలని తెలిపారు. ఆ ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలని, వేంపల్లి పాపాఘ్ని నది నుంచి ఎవరూ తరలించకూడదన్నారు. అంతేకాకుండా రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పడంతో వారు ధర్నా నిలిపివేశారు.

ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వరాదు


కరపత్రాలు విడుదల చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు

జిల్లా వ్యాప్తంగా ఇసుక తవ్వకాలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వరాదని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు పేర్కొన్నారు. వేంపల్లె పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఈనెల 11న నిర్వహించే ఆందోళనకు సంబంధించిన కరపత్రాలను ఆయన భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి మేరకు ఈ నెల 11న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడుతున్నామన్నారు. ఇసుక తవ్వకాలను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం నిలిపివేయాలన్నారు. ప్రభుత్వమే ఇసుక నడపాలని, ఇసుకపై అన్ని రకాల పన్నులు ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ మండల అధ్యక్షుడు దస్తగిరి, కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, భవ నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు కిట్టయ్య, ఆంజనేయులు, టోపీ సుబ్బయ్య, బాబు, శేఖర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేసి వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం, ఉప ప్రధాన కార్యదర్శి పగడపూల మల్లికార్జున డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలతోపాటు ఇతర హామీలను కూడా తక్షణమే అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా.. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ ఆదితిసింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లికి వందనం అమలు చేయకపోవడం వల్ల పిల్లల ఫీజులు పెనుభారంగా మారి చదువులు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలతో గ్రామాలు, పట్టణాల్లో నివసిస్తున్న పేద ప్రజానీకానికి ఎంతో కొంత కుటుంబాలకు ఆర్థిక సాయం తోడవుతుందని, సూపర్ సిక్స్ హామీలు అమలు కాకపోవడంతో పేదలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి 15000 రూపాయలు అందించాలని, సాంకేతిక కారణాలను పక్కన పెట్టి అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు మూడు వేల రూపాయలు నిరుద్యోగ భృతి తక్షణమే చెల్లించాలని, ప్రతి రైతుకి యేటా 20,000 రూపాయలు ఆర్థిక సాయం అందించాలన్నారు. అలాగే మహిళలకు చేయూత పథకం తక్షణమే అమలు చేయాలని, ఇంటింటికి రక్షిత తాగునీరు అందించాలని, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను 3 లక్షల నుంచి 10 లక్షల వరకు పెంచాలన్నారు. పేదలకు పశువులు కొనుగోళ్లు, దాణా, మందుల కొనుగోళ్లపై సబ్సిడీలు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, గోకులాలు ఏర్పాటు చేసి పశువుల మేత కోసం బంజరు భూములు కేటాయించాలన్నారు. అలాగే వ్యవసాయ కూలీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాయితీలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మునీంద్ర, శ్రీను, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినులకు పాము కాటు

గురుకులంలో కలకలం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వర్షిణి

కొండాపురం : మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న ఇద్దరు విద్యార్థినులను పాము కాటు వేసింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లవారుజామున 3 గంటల సమయంలో నిద్రిస్తున్న 8వ తరగతి విద్యార్థినులు మోటుపల్లి పల్లవి, కోగటం వర్షిణి పాము కాటుకు గురయ్యారు. అక్కడే ఉన్న సిబ్బందికి విద్యార్థులు ఏదో కుట్టినట్లు చెప్పడంతో.. గదిలో పరిసరాలను పరిశీలించారు. అయితే ఆ సమయంలో ఏది కనిపించకపోవడంతో విద్యార్థినులు నిద్రపోయారు. ఉదయం 6 గంటల సమయంలో కనిపించడంతో పామును చంపివేశారు. వెంటనే కొండాపురం ప్రభుత్వ ఆసుపత్రికి ఆ ఇద్దరు విద్యార్థినులను తీసుకెళ్లారు. అనంతరం ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి కోగటం వర్షిణిని, మోటపల్లి పల్లవిని కడప రిమ్స్‌కు తరలించారు. వారు అక్కడ చికిత్స పొందుతున్నారు. వారిద్దరి పరిస్థితి బాగానే ఉన్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారు. విషయం తెలిసిన వెంటనే మండల విద్యాశాఖ అధికారి ఓబులేసు రామయ్య, జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వెంటిలేటర్‌పై బాలికకు చికిత్స

ప్రొద్దుటూరు : పాము కాటుకు గురైన కోటం హర్షిణిది ప్రొద్దుటూరు పట్టణం సంజీవనగర్. ఆ బాలికకు హోమస్ పేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న హర్షిణికి వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేస్తున్నారు. హర్షిణి తల్లి ఎలిషమ్మ ఇళ్లలో పని చేస్తుండగా, తండ్రి దేవానంద్ హమాలీగా పని చేస్తున్నారు. ఆ బాలికను సోమవారం రాత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థినులు ప్రమాదంలో పడ్డారని జాతీయ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ అన్నారు. ఆదివారం అర్ధరాత్రి వారిని పాము కరిచినా వెంటనే ఆస్పత్రిలో చేర్పించలేదన్నారు. బాలికను ప్రజా సంఘాల నాయకులు సృజన శ్రీను, హరిత, రాజా పరామర్శించారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి


- బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి
- అండర్–19 బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జ్‌కారోనేషన్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో సోమవారం 68వ ఎస్జీఎఫ్ఐ బాలబాలికల అండర్ –19 బ్యాడ్మింటన్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ప్రొద్దుటూరు పట్టణంలో 7 జాతీయ స్థాయి, 10పైగా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించామన్నారు. జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి శారద మాట్లాడుతూ క్వాలిఫైడ్ ఎంపైర్‌లతో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 130 మంది క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. టీం చాంపియన్‌షిప్ పూర్తయిన తరువాత వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17 నుంచి 21 వరకు జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీలను టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జిలానిబాషా, అబ్జర్వర్ శ్రీనివాసరావు, ఎస్జీఎఫ్ఐ కార్యదర్శులు అరుణ, విజయప్రసాద్‌రెడ్డి, వ్యాయామ అధ్యాపకులు, ఉపాధ్యాయులు చంద్రబాబురెడ్డి, షామీర్‌బాషు, హేమాంబర్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, హసీనా తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

కరువు మండలాల ప్రకటనలో అన్యాయం


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



కడప కార్పొరేషన్ : కరువు మండలాల ప్రకటనలో వైఎస్సార్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వర్షాలు ఎక్కువై కొన్ని చోట్ల, తక్కువై కొన్ని ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో జిల్లా నుంచి ఒక్క మండలం కూడా ఎంపిక కాకపోవడం అన్యాయమన్నారు. ఈ ప్రకటన ద్వారా కేంద్రం నుంచి వచ్చే నిధులను కూడా రాకుండా ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. ఇప్పటికైనా కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లు ఈ నెల 5వ తేదీన పార్లమెంటు ముందుకు రాబోతోందని, దీనివల్ల ముస్లిం మైనార్టీలకు అన్యాయం జరుగుతుందన్నారు. వారి మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆ బిల్లుకు మద్దతు తెలపడం సరికాదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని, అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా కుంటిసాకులు చెబుతున్నారన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి 50 లక్షల మంది అర్హత సాధించకుండా పోయారన్నారు. రుషికొండలో టూరిజం కింద కట్టిన బిల్డింగ్‌లు చూసి విచ్చల విడిగా ప్రజాధనం ఖర్చు చేశారని చెప్పడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, త్యాగరాజు, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌తోనే పాలన

వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు


మాట్లాడుతున్న టీజేఆర్ సుధాకర్ బాబు

కడప కార్పొరేషన్ : డైవర్షన్ పాలిటిక్స్‌తోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు విమర్శించారు. సోమవారం ఇక్కడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన పథకాలను కాపీ కొట్టి, అమలు సాధ్యం కాని కొన్ని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇదేం కొత్తకాదని, 2014లోనూ ఇలాగే హామీలిచ్చి మోసం చేశారని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చేయలేదని గుర్తు చేశారు. నేడు ఉచితంగా సిలిండర్లు ఇస్తామని చెప్పి.. ముందు మీరు డబ్బు కడితే తర్వాత ఇస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి, రాష్ట్రంలో లక్షమంది పింఛన్లను తీసేశారని ఆరోపించారు. విజయవాడలో వరదలు వస్తే తిరుపతి లడ్డూ అంశాన్ని తెరపైకి తెచ్చారని, దీపం–2 పథకంలో ఫెయిలై రుషికొండకు వెళ్లి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వరదలు బీభత్సం సృష్టిస్తున్న సమయంలో దళిత ఎంపీ నందిగం సురేష్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. రాష్ట్రాన్ని పాలిస్తున్నది రెడ్‌బుక్ రాజ్యాంగమే తప్ప... చంద్రబాబు కాదన్నారు. పోలీస్ యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకొని నాయకత్వ పటిమ లేని లోకేష్‌ను నాయకున్ని చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఐదు నెలల్లోనే ఇంత చెడ్డ పేరు తెచ్చుకున్న ప్రభుత్వం ఈ దేశంలోనే లేదన్నారు.

రుషికొండ భవనాలపై అసత్య ప్రచారం

రుషికొండ భవనాలను సీఎం షెడ్యూల్‌లో టూరిజం భవనం అని పెట్టారని.. కానీ సీఎం అక్కడికి వెళ్లిన తర్వాత జగన్ ప్యాలెస్ అన్నట్లు మాట్లాడటం దారుణమన్నారు. రుషికొండలో టూరిజం భవనాలకు రూ.500 కోట్లు ఖర్చు చేశారని, జపాన్ టెక్నాలజీని ఉపయోగించారని చంద్రబాబే చెప్పారని.. మరి అమరావతి రాజధానిలో రూ.5 వేల కోట్లు దేనికి ఖర్చు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. నిన్న గాక మొన్న అమరావతిలో చెట్లు తొలగించడానికి రూ.30 కోట్లు ఖర్చు చేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నిర్మించిన అసెంబ్లీ భవన్, తాత్కాలిక సచివాలయాలను చూద్దాం.. వైఎస్ జగన్ నిర్మించిన రుషికొండ భవనాలను చూద్దాం రండి.. అంటూ సవాల్ విసిరారు.

రామ్మూర్తినాయుడు ఎందుకు పిచ్చివాడయ్యాడు?

వైఎస్ జగన్ కుటుంబ విషయాలు మాట్లాడుతున్నారని... చంద్రబాబు తమ్ముడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు పిచ్చివాడు ఎందుకయ్యాడో.. బాబు చెల్లెళ్లు ఎవరో టీడీపీ కార్యకర్తలకు తెలుసా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ తన చెల్లికి రూ.200 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సొంతమని.. ఒక కుటుంబానికి పరిమితం చేసి ఆయన స్థాయిని తగ్గించాలనే కుటిల రాజకీయాలు చెల్లవన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా పడగొట్టాలని చూశారని, విగ్రహంపై ఉన్న అక్షరాలను తొలగించారన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.